


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

**108**

**(14 జనవరి 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**సంక్రాంతి వచ్చింది.** కానీ ఏమి తెచ్చింది? కొన్ని తలపులు వెతికి తెచ్చింది. సంక్రాంతి అంటే ఎన్నో కవనాలు. ఎన్నోగానాలు.

కోడి పుంజులు, క్రొత్త అల్లుళ్ళు, కోడి గిత్తలు, ఎన్నో జ్ఞాపకం వస్తాయి. సంక్రాంతి కోడి పుంజులకు స్వర్గద్వారం తెలుస్తోంది. పిరికి చావూ, పీడ చావూ చావకుండా అవి వీరావేశంతో పోరాడి వీర స్వర్గమలంకరిస్తాయి.

వెనుకటికి ఒక కవి పుంగవుడు వ్రాశాడు - ఈనాటి పౌరుషం, లక్ష్యం, రెండూ పారిపోయి, ఒకటి కోడికత్తిలోనూ, ఒకటి వడిసెలలోనూ దాక్కున్నాయని, ఈనాడు కోడి కత్తుల మాట అలావుంచి, వాటి శౌర్యం, వైరం, రాజకీయవర్గాలలో చేరింది. వాటి ద్వారా రాజకీయరంగంలో విచిత్ర కుక్కుట పోరాటాల నిత్య సంక్రాంతి అవతరించింది.

గ్రామ సీమల్లో కోడిపందాలు ఇంకా విరివిగా సాగుతూనే వున్నాయి. కుక్కుటాలు నేటికీ పౌరుషశ్రీలను వెలారుస్తూనే వున్నాయి.

ఈ సంవత్సరం ఆంధ్రప్రాంతంలో మద్యపానం మీద నిషేధం తొలగించడంవల్ల చాలా ఇళ్ళల్లో పానీయాల సీసాలు అతి అందమైనవి, సుందరమైనవి బొమ్మల కొలువుల్లాగా అవతరిస్తున్నాయి. మనస్సుల మధురగానాలలో మునిగి తేలుతున్నాయి. అందువల్ల ధనం భోగిమంటలలో నవ్వుల పంటల్లో పడటం ఒక పండుగ దృశ్యంగా మారి అనుకోని సంక్రాంతి అవతరించింది.

కోడిపుంజుల పోరాటాలకు సంబంధించిన సామెతలు మనకు చాలా వినిపిస్తాయి నిత్యజీవితంలో. ఒక ఇంట్లో ఇద్దరు పిల్లలు తరుచుగా తగవులకు దిగుతుంటే బామ్మ అంటుంది. "ఇదేం ఖర్మమో? వీరిద్దరూ ఒకరిమీద ఒకరు కోడిపుంజులల్లే లేస్తారమ్మా ఇద్దరూ కత్తులు కాళ్ళకు కట్టుకు పుట్టారదేం ఖర్మమో?" అని.

ఎదుటివాళ్ళ మీదకు మెదిలితే తిడుతూ తగవుకు లేచే వాళ్ళను గురించి మాట్లాడేటప్పుడు, "సాగిందా పుంజుల పోరాటం. అని కత్తులు కాళ్ళకు కట్టుకు ఎగురుతాయి. వీటికి నాలుకలే కత్తులు. తిట్లతో నాట్యం ప్రారంభిస్తారు" అనడం వింటూ వుంటాం.

పల్లెటూళ్ళల్లో పండుగ శోభ యింకా కొంతవరకూ నిలిచివుందిగాని బస్తీల్లో, నగరాలలో వాటి స్వరూపమే హరించిపోయింది. చాలావరకు, పట్టణాలలో గుమ్మాల ప్రక్కగా ప్రవహించే మురుగు కాల్వల దుర్గంధం గొబ్బిదేవతలు భరించలేవని కాబోలు - అసలు వాటిని పెట్టడమే మానేసారు.

మొన్న ఒకావిడ అంటోంది. "పేడచేత్తో ముట్టుకోవడమెలా అసహ్యం. ప్లాస్టిక్కు గొబ్బెమ్మలు తయారుచెయ్యరేం? వాటిని ఒక టేబుల్ వేసి వరండాలో పెట్టుకోవచ్చుగా. ఈ "ఐడియా" ఎవరికీ రాదేం. బొంబాయిలో మావాడున్నాడు. వాడికి వ్రాసి పై సంక్రాంతికన్నా అవి వచ్చేలాగా చూడమనాలి" అంది.

"మీ అయిడియా అద్భుతంగా వుందండీ. సాధ్యమైనంతవరకు పాత ఆచారాలను మార్చివేయడమే. మన అభిలాష. ఇలాంటి "అయిడియాలు" మీరు కొన్ని ఆలోచించి బయట పెడుతూ వుండండి. పారిశ్రామికవేత్తలు మీకు మంచి బహుమతి కూడా ఇస్తారు" అన్నాను.

సంక్రాంతికి అల్లుళ్ళు రావడం అనేది పూర్వం పెద్ద ఉత్సవంగా ఉండేది. ప్రతి ఇంటికి అల్లుళ్ళందరూ గవర్నర్లలాగా దిగేవారు. వెంట రక్షణదళంలాగా అతని తల్లీ, తోబుట్టువులు వచ్చేవారు. అల్లుడుగారు "ఏ ఆర్డినెన్సు" పాసు చేసినా తక్షణం అమలు జరగవలసిందే

అల్లుళ్ళున్న కొద్దిరోజులూ మామలు, బావమరుదులూ ఏ క్షణానపడితే ఆ క్షణం ముద్దాయిలాగా నిలబడవలసిందే ఏం శిక్షపడుతుందోనని గజగజలాడవలసిందే ఎన్ని హుకుములు చేసినా, ఎన్ని బహుపరాకులు పలికినా అల్లుళ్ళ పెదవులమీద మందహాసం చిందడం అరుదుగా వుండేది.

ఒకరింటికి సంక్రాంతికి అల్లుడొచ్చి వారం పదిరోజులు మకాం చేసి ఎలాగైతేనేం ఇంటికి వెడతానని బయలుదేరాడట. ఆ సమయంలో మామగారు చేతులు కట్టుకుని నిలబడి "తమరికేదైనా లోపం జరిగితే మన్నించాలి. ఉంటే చెప్పండి. ఈసారి వచ్చేసరికి సర్దుకుంటాం" అని సవినయంగా అడిగాడుట.

దానికా జామాత గుడ్లు తిప్పుతూ "అది మీ వల్ల కాదులెండి. చెప్పడం అనవసరం" అన్నాడుట.

"మీరలా అంటే ఎలా? తప్పకుండా సర్దుకుంటాం. మీకంటే ఎక్కువేలమంది మాకు? మీరు తృప్తిగా, శాంతిగా వుండటమే మాక్కావలసింది" అన్నాడుట మామగారు.

గుమ్మం అవతల నిలబడి చీరకొంగు గీరుకుంటున్న అత్తగారు "అంతేమరి అంతకన్నా ఏం వుంటుంది?" అని వంతపాట పాడిందిట.

"అయితే లోపం చెప్పమంటారా తర్వాత చింతిస్తారు అయినా నాకు లెక్కలేదు. చెపుతాను. మీరు ఇంతకాలం బ్రతకడం నాకు మాత్రం ఇష్టంలేదు. ఒక్కతే కూతురని, సిక్లీ మామగారనీ మీ సంబంధానికి అంగీకరించాగాని, వేరే కారణాలవల్ల కాదు" అన్నాడుట అల్లుడు.

పాపం ఏం చేస్తాడు మామగారు? అత్తగారామాట వినలేక లోపలికి పారిపోయింది. మామగారు కొంచెం ఆలోచించి "మీకు కావలసింది నా ఆస్తేగా. నా ఆయుర్దాయం సంగతి దేనికి వచ్చే సంక్రాంతికి మీ అభిలాష తీరుస్తాను వెళ్ళిరండి" అని కొంచెం దూరం సాగనంపి వచ్చాడుట.

అల్లుళ్ళలో తనయుళ్ళవంటివారు వుంటారు. దానవులలాటివాళ్ళూ వుంటారు. రానురాను అల్లుళ్ళ ఆర్భాటాలు ఎక్కువైపోతున్నాయి. తెల్లని కాకులన్నీ కనిపిస్తున్నాయిగానీ, అల్లుళ్ళ మంచితనాలు మృగ్యమవుతున్నాయి. అడిగినంతకట్నం గ్రుమ్మరించి తెచ్చుకోవడంవల్ల ఏర్పడిన అగచాట్లవి.

కనుక సంక్రాంతి పండగల్లో అల్లుళ్ళ మర్యాదలు చాలావరకు అదృశ్యమవుతున్నాయి. ఎవరింటికైనా పాత ఆచారం ప్రకారం కొందరు వచ్చినా, టూరిస్టుల్లాగా వస్తున్నారుగాని రాయల్ గెస్టుల్లాగా రావడం పోయింది.

గంగిరెద్దుల హడావుడి కూడా తగ్గింది చాలావరకు. అందమైన ఎద్దును సంపాదించి, ఎంతో చక్కగా అలంకరించి తెచ్చేవారు పూర్వం. గంగిరెద్దులకు్కూడా కొన్ని లక్షణాలుండేవి. అందమైన నమూపురం, పసందైన కొమ్ములు, గంభీరమైన నడక, వగైరాలుండటంవల్లనే వాటిని చూడగానే కొంత ఆకర్షణ ఏర్పడేది.

ఇంటింటా వాటికి చాటెడు బియ్యం దొరికేవి. వాటి పాదాలు కడిగేవారు. పసుపు రాసేవారు. కొమ్ములకు మెళ్ళోనూ బంతి పూలదండలు వేసేవారు. వెన్నుమీద వస్త్రం కప్పితే పున్నెమని భావించేవారు. అవి దీవిస్తే అమితమైన భాగ్యాలు కలుగుతాయని భావించేవారు.

ఇప్పుడు వాటి దీవినలెవరిక్కావాలి? అయినా అంత వదాన్యత ఎక్కడుంది ఎసట్లో బియ్యానికే వెతుక్కునే కాలంలో చేటల్లో ధాన్యం ఎక్కడ నుంచి తెచ్చి పోస్తారు?

మొన్న మా వీధికో గంగిరెద్దు వచ్చింది. మేళం వినిపించగానే చూద్దామని వరండాలోకి వెళ్ళాను. మూడేళ్ళ దూడకు మూడు మూరల బట్టకప్పి, ముందుకాళ్ళకు నల్లటి త్రాళ్ళు కట్టి తీసుకువచ్చారు. పదమూడేళ్ళవాడొకడు సన్నాయి వాయిస్తున్నాడు. వాడిపై వాడులాగా వున్నాడు వాడు డోలు కొడుతున్నాడు.

'రామా సుజన జీవనా' అనే త్యాగరాయకృతిని వాడు త్రుంచి, త్రుంచి, ఆలాపన వచ్చినప్పుడు ఊపిరితిత్తుల్లో వున్నగారి అంతా ఉపయోగించివాడు పాడుతున్నాడు. పిల్లవాళ్ళు అదే గొప్పగా భావించి ఆ మూడేళ్ళ గంగిరెద్దుకే ముచ్చట పడుతున్నారు. తలో రెండు పైసలు తెచ్చి ఇస్తున్నారు.

ఆ కుర్రవాడు పాట ఎలా వున్నా, ఏ సినిమా పాటో పాడకుండా త్యాగరాయకృతి ఎత్తుకున్నందుకు సంతోషించి పదిపైసలిచ్చి పంపించాను. వాడు గంగిరెద్దును దీవించమన్నాడు. దానికి వోపికాలేదు. ఇష్టంలేదు. అందుకని అలానే నుంచుంది. అతగాడు మరో యింటికి తోలుకు పోయాడు.

నేను నుంచుని ఆలోచించాను. "అన్ని రంగాలలో శక్తి క్షీణించిపోతోంది. గంగిరెద్దు స్వరూపం ఎంత మారిపోయిందో" అని.

"మన దేశంలో నాయకత్వాలు మాత్రం?" అనే ప్రశ్న మనస్సులో మెదిలింది. ప్రమాణాలు తరిగిపోతున్నాయి. నమూనాలు మిగులుతున్నాయి.

Post your comments